వైభవంగా గరుడ సేవ



కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పరిధిలోని ఎస్‌సీఎల్ నార్త్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం గరుడ సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. పుర వీధుల్లో స్వామివారి ఊరేగింపు అట్టహాసంగా జరిగింది. శ్రావణమాసం సందర్భంగా జరిగే పూజా కార్యక్రమంలో భాగంగా పౌర్ణమి సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లక్ష పుష్పార్చన



కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్‌లోని వేంకటేశ్వర ఆలయంలో శనివారం స్వామి వారి మాస కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. హయగ్రీవ హవనం శ్రీవంకీ, లక్ష పుష్పార్చన తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడి సేవలో సీబీఐ డీఐజీ

కీసర: కీసరగుట్టలోని రామలింగేశ్వరస్వామిని సీబీఐడీఐజీ శివసుబ్రహ్మణ్యం కుటుంబసభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయన కుటుంబసభ్యులకు ఆశీర్వచనం చేశారు. ఆలయ చైర్మన్ తటాకం నారాయణ, ఈఓ సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా పేట్ బషీర్‌బాగ్ డీసీపీ కోటిరెడ్డి స్వామివారి సేవలో పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్ తదితరులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ అన్నారు. శనివారం కోయబస్తీలో రూ. 7 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న డ్రైనేజీ పైపులైన్ పనులను వాటర్‌వర్క్ మేనేజర్ తేజతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీ పైపులైన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. పనులను అధికారులు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ సూపర్ వైజర్ లక్ష్మణ్‌యాదవ్, శ్రీకాంత్, లలిత, దుర్గ, శ్రీనివాస్, బుర్రి యాదగిరి, దేవేందర్, మోహన్, మహేష్, విక్రమ్, కమల్, నర్సింహ్మా, రాములు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

పద్మారావునగర్: ఆలయాలు ఆధ్యాత్మిక చింతన నిలయాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ గాంధీనగర్‌లోని షిర్డి సాయిబాబా ఆలయం వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక మార్గం ద్వారా ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు శాంతికుమార్, నాయకులు లక్ష్మీపతి, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వివేకానంద్‌కు భారీ రాఖీని అందజేస్తున్న మహిళా సంఘాల సభ్యులు



మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌కు రాఖీ కడుతున్న మహిళలు

ఘనంగా రక్షా బంధన్

రాఖీ కట్టి స్వీటు తినిపించిన సోదరీమణులు

నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. అన్నాదమ్ములకు అక్కా చెల్లెళ్లు రాఖీలు కట్టారు. అనంతరం హారతులిచ్చి స్వీటు తినిపించారు. ఆడబిడ్డలు పుట్టింటికి రావడంతో పండుగ వాతావరణం నెలకొంది. చిన్నా పెద్ద ప్రతి ఒక్కరూ రాఖీ కట్టించుకుని తమ సోదరీల ఆశీర్వాదాలు తీసుకున్నారు.

– కుత్బుల్లాపూర్



కొంపల్లిలో శివారెడ్డి, సుదర్శన్‌రెడ్డిలకు రాఖీ కడుతున్న మంత్రి సీతక్క



కార్మిక నాయకుడు చింతల నాగరాజుకు రాఖీ కడుతున్న సోదరి



కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంత్‌రెడ్డికి..



తెలంగాణ ఉద్యమకారుడు బాల్‌రాజ్‌కు రాఖీ కడుతున్న ముస్లిం సోదరి



బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శేఖర్‌యాదవ్‌కు రాఖీ కడుతున్న సోదరీమణులు



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు..

బ్యాగును అప్పగించిన పోలీసులు

జీడిమెట్ల: ప్రయాణికురాలు ఆటోలో పోగొట్టుకున్న బ్యాగును జీడిమెట్ల పోలీసులు గుర్తించి తిరిగి అప్పగించారు. జీడిమెట్ల డీఐ కనకయ్య వివరాల ప్రకారం.. గాజులరామారం డివిజన్ ఉషోదయ టవర్స్‌కు చెందిన అండాలు శనివారం వేరే ఊరికి వెళ్లేందుకు గాజులరామారం చిత్తారమ్మ గుడి వద్ద ఆటో ఎక్కి షాపూర్‌నగర్ ఎక్స్‌రోడ్డులో దిగింది. ఆమె బ్యాగును ఆటోలోనే మరిచిపోయింది. కొద్దిసేపటిలోనే బ్యాగు మరిచిపోయినట్లు గ్రహించిం జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. డీఐ కనకయ్య షాపూర్‌నగర్‌లోని పలు సీసీ కెమెరాలను పరిశీలించి ఆటో నంబర్ ఆధారంగా ఆటో యజమానిని గుర్తించారు. ఆటో డ్రైవర్‌కు కాల్ చేసి బ్యాగును తెప్పించి బ్యాగును బాధితురాలికి అందజేశారు. రూ.10 వేల సామాన్లతో పాటు ఇతర వస్తువులు ఉన్న బ్యాగును తిరిగి అప్పగించడంతో బాధితురాలు సంతోషం వ్యక్తం చేసింది.



బ్యాగును అప్పగిస్తున్న పోలీసులు

నేడు బీఈడీ అభ్యర్థుల జాబితా విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: బీఈడీ కోర్సులో సీటు సాధించిన అభ్యర్థుల మొదటి విడత జాబితాను ఆదివారం విడుదల చేయనున్నట్లు టీజీ ఎడ్‌సెట్–2025 అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి శనివారం తెలిపారు. ఎడ్‌సెట్–2025లో అర్హత సాధించిన అభ్యర్థుల్లో 17, 151 మంది వివిధ బీఈడీ కాలేజీలో ప్రవేశాలకు వెబ్‌ఆప్షన్స్ ఇచ్చిన్నట్లు చెప్పారు. సీటు సాధించిన విద్యార్థులు ఈ నెల 11 నుంచి 14 వరకు ఆయా కాలేజీల్లో రిపోర్టు చేయాలన్నారు.

ఎర్రగడ్డ రైతు బజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా 35, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 26, పందిరి బీర 26, క్యాబేజీ 11, క్యారెట్ 41, దొండ 23, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 28, కీర 18, దోసకాయ 13, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 23, చామగడ్డ 23, మొరంగడ్డ 28, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

అన్ని హంగులతో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

- ఫంక్షన్‌హాల్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: అన్ని హంగులతో మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణం అందుబాటులోకి వచ్చిందని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అడ్డగుట్ట కాలనీలో రూ.6.36 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను శనివారం కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి నుంచి ప్రజలకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ ఫంక్షన్ హాల్‌లో స్టేజీ, రెండు గదులు, దీపాలు, విశాలమైన హాలు, అధునాతన టైల్స్, పార్కింగ్ వంటి సకల వసతులతో నిర్మించామన్నారు. అందరు కలిసి కాలనీ అభివృద్ధికి పాటు పడాలని, కాలనీ సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్లాలని సూచించారు. హైదర్‌నగర్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.




మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభిస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం

ప్రజల సౌకర్యార్థం భాగ్యనగర్‌కాలనీ, అడ్డగుట్ట, ఆదిత్యనగర్, రామ్‌నరేష్ నగర్, భాగ్యనగర్ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు పీఏసీ చైర్మన్ గాంధీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గ అభివృద్ధికి గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 1650 కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు.

ఓయూలో ఘనంగా ఆదివాసీ దినోత్సవం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆదివాసి స్టూడెంట్ యూనియన్ (ఏఎస్‌యూ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆదివాసి జాతీయ పతాకాన్ని ఓయూ అధ్యాపకులు ప్రొ.రేగ రాజేందర్ ఎగురవేసి మాట్లాడారు. అనంతరం ఆదివాసీ సాంప్రదాయ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌యూ రాష్ట్ర నాయకులు సాగబోయిన పాపారావు, అరుణ్‌కుమార్, వెంకన్న, నరేష్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కార్యక్రమంలో పాల్గొన్న కూన శ్రీశైలంగౌడ్, యువజన కాంగ్రెస్ నాయకులు

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. షాపూర్ నగర్ చౌరస్తాలో శనివారం యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘం జెండాను యువజన కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ కాంగ్రెస్ దేశానికి ఎంతోమంది గొప్ప నాయకులను అందించిందన్నారు. యువజన నాయకులు పార్టీ అభివృద్ధికి మరింత కష్టపడాలన్నారు. పార్టీకి యువకులే కీలకమన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ ఉమ్మడి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కూన రఘుగౌడ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం తరుణ్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జి సురేష్, జిల్లా జనరల్ సెక్రటరీ నిఖిల్ సాయి, నియోజకవర్గ ఉపాధ్యక్షులు అరుణ్ గౌడ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో కంప్యూటర్ ఇంజనీరింగ్, కమ్యూనికేషన్ సిస్టమ్స్ పురోగతిపై మూడు రోజులపాటు జరిగిన 6వ అంతర్జాతీయ సదస్సు శనివారం విజయవంతంగా ముగిసింది. సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, ఫ్రాన్స్‌లోని ఐఎంటీ బిజినెస్ స్కూల్, అసోం కజిరంగా విశ్వ విద్యాలయం, మోహన్‌బాబు విశ్వ విద్యాలయం సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహించాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్‌జియూకేటీ ఇన్‌చార్జి ఉపకులపతి, సీనియర్ ప్రొఫెసర్ డా.ఎ.గోవర్ధన్, ఇస్రో ప్యారవ్ సెంటర్ డైరెక్టర్ జ్ఞాన గాంధీ వాసుదేవన్, వెబైల్ యాప్స్ ఇండియా సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శంకర్ మకూపాటి, టైమ్స్ ఇంటర్నెట్ ప్రొడక్ట్ హెడ్ డా.నిశాంత్ స్తనాహ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ఇలాంటి సదస్సులు సాంకేతిక రంగం అభివృద్ధి కోసం, వివిధ రంగాల పరిశోధకులకు అనుసంధాన వేదికలుగా నిలుస్తాయన్నారు. ఉత్తమ పరిశోధన పత్రాలకు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో ఐఆర్‌డీబీటతీ నుంచి డా.రవి వడమాని, యూఎస్ఏలోని ఎస్‌జేఎస్‌యూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా.సప్తరుషి సేన్ గుప్తా, ఎన్ఐటీ తిరుచిరాపల్లి నుంచి డా. శ్రీనివాసులు, కళాశాల డైరెక్టర్ డా.బి.చెన్నకేశ్వరరావు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న వక్తలు

కత్తులతో దాడి

- చికిత్స పొందుతున్న బాధితుడు
- పోలీసులకు ఫిర్యాదు

కుత్బుల్లాపూర్: ఓ వ్యక్తిపై కత్తులతో దాడి చేయగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తూముకుంటకు చెందిన సురేష్‌కుమార్ అతని స్నేహితులు కాసుల వంశీగౌడ్, మహేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డిలో డిన్నర్ చేసేందుకు శుక్రవారం రాత్రి అంగడిపేట్‌కు కారులో వచ్చారు. కారును రోడ్డు పక్కన పార్కు చేసి హోటల్‌కు వెళ్లగా అర్ధరాత్రి 1 గంట కావడంతో అప్పటికే హోటల్ మూసివేశారు. దీంతో వెనక్కి వచ్చిన వంశీగౌడ్ కారు వద విసర్జన చేస్తున్న వ్యక్తిని ప్రశ్నించాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య మాటామాట పెరగడంతో మరో ఇద్దరు వ్యక్తులు కత్తులతో దాడి చేయబోగా.. సురేష్‌కుమార్, బాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి పారిపోయారు. వారికి దొరికిన వంశీగౌడ్‌పై కత్తులతో దాడి చేశారు. రినోవా ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం !

రంగారెడ్డినగర్: పైపులైన్ పనుల పేరుతో తీసిన గోతులను పనులు పూర్తైనా సరిగ్గా పూడ్చకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పైపులైన్ పనులను నెల రోజుల క్రితం చేపట్టి పూర్తి చేశారు. ఈ క్రమంలో రోడ్డును ఆనుకుని పైపులు వేసేందుకు గొయ్యి తీశారు. అయితే పనులు పూర్తైనా సదరు గోతులను సరిగ్గా పూడ్చకపోవడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రమాదకరంగా మారాయి. భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ సంస్థ ఒక చోటనే ప్రమాద సూచిక బోర్డు, కోన్‌లు ఏర్పాటు చేసి మిగతా ప్రాంతాల్లో వదిలేశారు. దీంతో వేగంగా వచ్చే వాహనదారులు వర్షం పడ్డ సమయంలో గోతులను గమనించక అందులో పడే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా సర్కిల్ అధికారులు రోడ్డు పక్కన గోతులు పూడ్చేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



షాపూర్‌నగర్- చింతల్ రోడ్డులో హెచ్‌ఎంటీ పరిశ్రమ సమీపంలో రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

ఎల్‌ఆర్‌ఎస్‌కు తప్పని తిప్పలు !

- శివారుల్లో ఆలస్యంగా లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ ప్రొసీడింగ్స్
- ఆర్జీలకు కొర్రీలతో నెలల తరబడి ఆఫీస్‌ల చుట్టూ ప్రదక్షిణలు
- మొత్తం దరఖాస్తులు 1.64 లక్షలు.. పరిష్కారమైనవి 1.02 లక్షలు
- ముప్పు తిప్పలు పెడుతున్న మూడు లాగిన్లు

సాక్షి,మేడ్చల్ జిల్లా: జిల్లాలో లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్) ప్రొసీడింగ్స్ చాలా ఆలస్యమవుతున్నాయి. దీంతో దరఖాస్తుదారులు నెలల తరబడి సంబంధిత పురపాలక సంఘాల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అధికారులు చూస్తామని చెప్పడం మినహాయించి ప్రక్రియ ముందుకు కదలడం లేదని దరఖాస్తుదారులు వాపోతున్నారు. పుర కమిషనర్లు ఆదేశించినా.. టౌన్‌ప్లానింగ్ విభాగం తీరుమారడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలు పురపాలక సంఘాల్లో పూర్తిస్థాయి టౌన్ ప్లానింగ్ అధికారి లేకపోవడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఒకే అధికారి 2–3 పురపాలక సంఘాలకు ఇన్‌చార్జ్

ఒకే అధికారికి అదనంగా 2–3 పురపాలికలను అప్పగించడంతో పనుల్లో జాప్యానికి కారణమవుతోంది. ఈ నేపథ్యంలో నగర శివారు మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో ఖాళీ స్థలాలను క్రమబద్ధీకరించుకోవడానికి దరఖాస్తు చేసుకున్న స్థల యజమానులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఆదాయం రాబట్టుకోవడానికి ప్రభుత్వం ఇటీవల 25 శాతం రాయితీ అవకాశాన్ని కల్పించగా.. ఎలాంటి వివాదం లేని దరఖాస్తులకు మోక్షం లభించగా.. మరికొన్నింటికీ కొర్రీలు తప్పకపోవటంతో దరఖాస్తుదారులు నెలల తరబడి సంబంధిత కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా.. పరిష్కారానికి నోచుకోవటం లేదని పేర్కొంటున్నారు.

తప్పని కొర్రీలు

లే అవుట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తుదారుల నుంచి సంబంధిత పురపాలక సంఘాలు రూ. వేలల్లో ఫీజు వస్తోంది. ఈ మొత్తాన్ని చెల్లించేందుకు ముందుకొస్తున్నప్పటికీ ఆ దరఖాస్తుల పరిష్కారానికి రకరకాల కొర్రీలు చూపుతుండటంతో నానా అవస్థలు పడుతున్నారు. అభ్యంతరాలను పరిష్కరించుకోవడానికి కొందరు రిజిస్ట్రేషన్, ఇరిగేషన్, రెవెన్యూ, పురపాలక సంఘాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేలల్లోనే పెండింగ్..

హైదరాబాద్ జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ తర్వాత అత్యధిక ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 1.64 లక్షలు వచ్చాయి. ఇందులో ఇప్పటి వరకు 1.02 లక్షల దరఖాస్తులు పరిష్కారం కాగా, వాటికి తగినట్లుగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు రుసుము కూడా చెల్లించారు. నగదు చెల్లించే వరకు పోన్లు చేసి మరీ ఆరా తీసిన అధికారులు ప్రొసీడింగ్ కాపీలు ఇచ్చేందుకు వెనకడుగు వేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. కాపీలు ఇచ్చేందుకు కూడా వెనుకడుగు వేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత అధికారులు సమీక్షించడం లేదనే విమర్శలున్నాయి.

మూడు లాగిన్‌లతో అవస్థలు

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు ప్రాసెసింగ్ కోసం 3 లాగిన్లు కేటాయించారు. 3 విడతల్లో దరఖాస్తుల క్రమబద్ధీకరణ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు అన్ని పత్రాలతో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత ఎల్–1 అధికారికి వెళ్తున్నాయి. ఇక్కడ క్షేత్రస్థాయి పరిశీలన, పత్రాలు అప్‌లోడ్ చేసిన తర్వాత ఎల్–2కి వెళ్తున్నాయి. ఎల్–2లో ఫీజు మదింపు జరగాల్సి ఉండగా.. వీరి లాగిన్‌లో మళ్లీ ఎల్–1 పెండింగ్ అని చూపుతున్నాయి. అన్నీ సక్రమంగా ఉన్న దరఖాస్తులకు సంబంధించి ఫీజు చెల్లించిన వారిలో కొందరికి ఐజీఆర్ఎస్ పెండింగ్ సూచిస్తోంది. ఫీజు చెల్లించిన తర్వాత ఇరిగేషన్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ నుంచి పత్రాలు తీసుకొచ్చి అప్‌లోడ్ చేయాల్సి ఉంటోంది. ఈ ప్రక్రియ పూర్తయితే మళ్లీ ఎల్–1 పెండింగ్ వస్తుంది. ఫీజు కట్టిన దరఖాస్తులు వెబ్‌సైట్‌లో అసలే కనిపించడం లేదని తెలుస్తోంది. అవి ఎక్కడ ఉన్నాయనే విషయం కూడా దరఖాస్తుదారుడు, లాగిన్ అధికారికి తెలియడం లేదు.